
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





సుంకేసుల బ్యారేజీ నుంచి కేసీ కాలువ గేట్ల లీకేజీ (ఫైల్)

మన ప్రాజెక్టులు భద్రమేనా...?



అవుకు రిజర్వాయర్ గేట్లు

- నిర్వహణ నిధులు కూడా ఇవ్వని గత వైసీపీ ప్రభుత్వం
- శ్రీశైలం గేట్లు రబ్బర్ సీల్స్ మార్చకపోవడంతో లీకేజీలు
- వెలుగోడు జలాశయం మరమ్మతులు ఎప్పుడో?
- అవుకు జలాశయం గేట్ల నుంచి లీకేజీలు
- సుంకేసులు బ్యారేజీ ఆధునికీకరణ ప్రతిపానదలకే పరిమితం
- తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోయిన ఘటన
- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల భద్రతపై ఎన్నో అనుమానాలు

కర్నూలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

పులిచింతల ప్రాజెక్టు 16వ గేటు 2021 ఆగస్టులో కొట్టుకుపోయింది.. అదే ఏడాది నవంబరులో కడప జిల్లా అన్నమయ్య ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయకపోవడంతో ఏకంగా ప్రాజెక్టే కొట్టుకుపోయింది. గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఈ ఘటనలు మరవక ముందే శనివారం రాత్రి తుంగభద్ర డ్యాం గేట్లు దింపుతుండగా 19వ గేటు చైన్ లింక్ తెగిపోయి గేటు కొట్టుకుపోయింది. దీంతో కర్ణాటక సహా తెలుగు రాష్ట్రాల ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ప్రభుత్వాలు డ్యాం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే డ్యాం గేటు కొట్టుకుపోయిందని సాగునీటి నిపుణులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాయలసీమ పల్లెసీమలకు సాగు, తాగునీరు అందించే శ్రీశైలం, వెలుగోడు, అవుకు, సుంకేశుల వంటి ప్రాజెక్టులు భద్రమేనా..? వీటి నిర్వహణపై పాలకుల చిత్తశుద్ధితో పని చేస్తున్నారా..? వంటి ప్రశ్నలు తలెత్తున్నాయి.


రాయలసీమ అంటేనే గుర్తొచ్చేది తీవ్ర కరువు.. దుర్భిక్షం. ఏటేటా సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతోంది. ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలకు ఉప్పొంగుతున్న తుంగభద్ర, కృష్ణా నదుల వరదను ఒడిసిపట్టి నిల్వ చేసుకునేందుకు ఉన్నవే నాలుగైదు జలాశయాలు. తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం డ్యాం ఎగువ జలాలను కరువు సీమకు మళ్లించాలనే లక్ష్యంగా 1983-04లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేపట్టిన తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా వెలుగోడు, అవుకు, గాలేరు-నగరి ప్రాజెక్టులో భాగంగా గోరుకల్లు, హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా కృష్ణగిరి, పత్తికొండ జలాశయాలు నిర్మించారు. ఆయా జలాశయాలకు కృష్ణా జలాలు మళ్లించేందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్, కేసీ కెనాల్‌కు నీటిని మళ్లించేందుకు తుంగభద్రపై సుంకేసుల బ్యారేజీ, హంద్రీ నదిపై గాజులదిన్నె జలాశయం నిర్మించారు. ఆయా ప్రాజెక్టులకు నిర్వహణ నిధులు ఇవ్వక.. కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం సాగునీటి ప్రాజెక్టులకు శాపంగా మారిందనే ఆరోపణలు లేకపోలేదు.

అవుకు.. ఆగని లీకేజీలు

తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా 4.148 టీఎంసీల సామర్థ్యంతో అవుకు జలాశయం నిర్మించారు. 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది.. కడప జిల్లాకు కృష్ణా జలాలు ఈ జలాశయం నుంచే మళ్లిస్తున్నారు. ఎంతో కీలకమైన అవుకు రిజర్వాయర్ ఎస్‌ఆర్‌బీసీ, పాలేరు, గొల్లలేరు, జీఎన్‌ఎస్‌ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల గేట్లు దెబ్బతిన్నాయి. కొన్ని గేట్లు స్ట్రక్ అవుతున్నాయి. రోప్ (ఇనుప తాళ్లు) తెగిపోతున్నాయి. గేట్లు, రోప్‌లు కొత్తవి ఏర్పాటు చేయలని ఇంజనీర్లు అంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో గేట్లు ఏర్పాటు చేయాలంటే దాదాపుగా రూ.6 కోట్లు కావాలి. ప్రభుత్వం నిధులు ఇస్తే తప్ప గేట్ల మరమ్మతులకు నోచుకునే పరిస్థితి లేదు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం శాపంగా మారింది. 2022లో రూ.2.01 కోట్లతో మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపారు. పాలేరు స్లూయిస్ మరమ్మతులకు రూ.45 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. జగన్ ప్రభుత్వంలో పనులు చేస్తే బిల్లులు రావనే భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. టీడీపీ ప్రభుత్వం అవుకు గేట్ల మరమ్మతులపై దృష్టి సారించాలి.

పీఆర్‌పీ గేట్లపై దృష్టి పెట్టాలి

రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని మళ్లించే జీవనాడి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్. ఎస్‌ఆర్‌బీసీ, తెలుగుగంగ, గాలేరు-నగరి, కేసీ కెనాల్ ఎస్కేప్ చానల్, కుందూ ద్వారా సోమశిల జలాశయానికి కృష్ణా వరద జలాలు ఇక్కడి నుంచే మళ్లించాలి. 2004-05లో 44 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో 10 గేట్లు ఏర్పాటు చేసి హెడ్ రెగ్యులేటర్ నిర్మించారు. ఎంతో కీలకమైన రెగ్యులేటర్ గేట్లు నిర్వహణలో ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం శాపంగా మారింది. అయితే.. గతేడాది కొంత వరకు రిపేరీలు చేశామని ఇంజనీర్లు అంటున్నారు. ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన పాత హెడ్ రెగ్యులేటర్ పవర్ జనరేషన్ గేట్ల నుంచి లీకేజీలు వస్తున్నాయి.



పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గేట్లు


తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 11: తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకు పోవడంతో 90 వేల నుంచి లక్ష క్యూసెక్కుల దాకా నీరు దిగువ ప్రాంతాలకు వస్తుండటంతో మంత్రాలయం, కౌతాళం, కోసిగి, నందవరం, సి. బెళగల్ మండలాల తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఆదివారం ఎస్పీ, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, జలవనరుల శాఖ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు, తహసీల్దార్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నుంచి నీటి విడుదల విషయాన్ని ప్రజలకు చెప్పి.. నదిలోకి దిగనీకుండా, చేపలు పట్టడానికి మత్స్యకారులను వెళ్లనీయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయం దండోరా, మైకుల ద్వారా ప్రచారం చేయించాల న్నారు. నీటి ప్రవాహ పరిస్థితిపై పర్యవేక్షణ చేస్తుండాలని సూచించారు. ఎస్‌డీఆర్ఎఫ్ టీములను సిద్ధంగా ఉంచుకోవాలని, ఎస్పీ బిందుమాధవ్‌ను కోరారు. పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో మధుసూదన్‌రావు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి అనుపమ, జిల్లా ఫిషరీస్ అధికారి శ్యామల, ఎస్‌డీఆర్ఎఫ్ ఇన్‌చార్జి కమాండెంట్ పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని శ్రీశైలం

శ్రీశైలం ప్రాజెక్టు శాశ్వత మరమ్మతుల కోసం 'డ్యాం రిహాబిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం' (డ్రిప్)-2 కింద రూ.139 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. కొర్రీలు పెట్టి ప్రపంచ బ్యాంక్ వెనక్కి పంపితే.. లోపాలను సవరించి రూ.190 కోట్లతో మరో ప్రతిపాదన పంపించారు. తాజాగా ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు డాక్టరు హ్యానిశ్‌శాలం, అభిషేక్‌కుమార్ సూచనల మేరకు డ్యాం భద్రతకు చేపట్టాల్సిన 19 పనులకు రూ.203 కోట్లతో మరో ప్రతిపాదన పంపినట్లు ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ కర్నూలు సీఈ కబీర్‌బాషా వివరించారు. స్పిల్‌వే గేట్ల దిగువన ప్లంజ్‌పూల్ గుంత పూడ్చివేత, 2009 వరదకు దెబ్బతిన్న డ్యాం డౌన్ స్ట్రీమ్‌లో ఆప్రాన్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్డు, రిటైనింగ్ వాల్, రివర్స్ స్లూయిస్ గేట్లు మరమ్మతులు, లీకేజీలు అరికట్టేందుకు గేట్లకు సీల్స్ ఏర్పాటు వంటి పనులు చేయాల్సి ఉంది. తక్షణ మరమ్మతుల కోసం ఓ అండ్ ఎం గ్రాంటు కింద రూ.64 లక్షలు తక్షణమే ఇవ్వాలని టీడీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతిపాదనలు పంపారు. నిధులు వస్తే తప్పా మరమ్మతులు చేయలేని పరిస్థితి ఉంది. గత వైసీపీ లాగే ఈ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం ప్రదర్శించకుండా తక్షణ మరమ్మతులకు నిధులు ఇవ్వాలి. లేదంటే తుంగభద్ర లాంటి సంఘటన జరిగితే సీమ రైతులు తీవ్ర నష్టాని చవిచూడాల్సి వస్తుంది.



శ్రీశైలం ప్రాజెక్టు స్పిల్‌వే గేట్లు దిగువన ప్లంజ్‌పూల్ (ఫైల్)

వెలు'గోడు' వినేదెవరు..?



కర్నూలు జిల్లాలో తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా 16.95 టీఎంసీలతో వెలుగోడు జలాశయం నిర్మించారు. సీమ జిల్లాకు సాగునీరు, చెన్నై నగరానికి తాగునీరు అందించే ప్రధాన రిజర్వాయర్ ఇది. 218.40 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, ఆనకట్ట పొడవు 11.64 కి.మీటర్లు, ఆనకట్ట ఎత్తు 28 మీటర్లు, 6 మీటర్లు ఆనకట్ట పైభాగం వెడల్పుతో 1983-84లో నిర్మాణ పనులు చేపట్టి 1996లో పూర్తి చేశారు. దేశంలోనే అతిపొడవైన మట్టి ఆనకట్ట జలాశయం ఇది. లోపలి భాగంలో వెదర్ రాక్ రిటిట్మెంట్ (రాతిపరుపు) ఏర్పాటు చేశారు. 23 ఏళ్ల కావడంతో నీటి అలల ఒత్తిడికి రాతిపరుపు ఆనకట్ట అక్కడక్కడ కుంగిపోతోంది. గేట్లు నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా ఉంది. ఈ జలాశయం మరమ్మతుల కోసం డ్యాం రిహ్యాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డ్రిప్)-2 కింద రూ.99 కోట్ల ఇవ్వాలని గతంలో ప్రతిపాదనలు పంపితే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. తాత్కాలిక మరమ్మతులతోనే సరిపుచ్చుతున్నది.

సుంకేశుల ఆధునికీకరణ మరిచారా..?

తుంగభద్ర నదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన బ్యారేజీ సుంకేశుల జలాశయం. కేసీ కాలువ ద్వారా 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు ఈ బ్యారేజీ నుంచే అందాల్సి ఉంది. 2009 వరదలకు ప్రాజెక్టు పూర్తిగా దెబ్బతింది. నాడు టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పథకం కింద రూ.8.50 కోట్లు మంజూరు చేస్తే రూ.6.50 కోట్లు ఖర్చు చేసి గేట్లు మరమ్మతులు చేశారు. కేసీ కాలువ గేట్లు లీకేజీలు వస్తున్నాయి. పూర్తిస్థాయి ఆధునికీకరణ కోసం 2018-19లో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు (సింప్) కింద రూ.578 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. నిధులు కూడా మంజూరు అయ్యారు. ఇంతలో టీడీపీ ప్రభుత్వం పోయి వైసీపీ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా 10 శాతం నిధులు చెల్లించకపోవడంతో ఆ నిధులు వెనక్కివెళ్లాయి. టీడీపీ ప్రభుత్వమైనా సుంకేశుల ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలి.



సుంకేసుల జలాశయం

వేల్పనూరు శివార్లలో చిరుతపులి

వెలుగోడు, ఆగస్టు 11: వెలుగోడు మండలంలోని వేల్పనూరు గ్రామ శివార్లలో ఓ చిరుత పులి సంచరిస్తోంది. ఓ రైతు దానిని చూసి ఊళ్లోకి చేరుకుని గ్రామస్థులకు సమాచారం అందించాడు. ఈ విషయాన్ని కొంతమంది అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అటవీ శాఖ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని చిరుత పులి ఆచూకీ కోసం గాలించారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారి ఎంఏ ఖాన్‌ను వివరణ కోరగా తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో చిరుతపులి సంచరించిన ప్రాంతాన్ని గాలించామన్నారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు పగ్‌మార్క్స్ గుర్తులు చెదిరి పోవడంతో ఆ గుర్తులు చిరుత పులివి అవునా కాదా? అని తెలియాల్సి ఉందని అన్నారు. ఎవరికైనా చిరుత పులి కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఏడు గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం, ఆగస్టు 11: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి వరద ప్రవాహం కొనసాగడంతో డ్యామ్ అధికారులు జలాశయం ఏడు క్రస్టు గేట్లను పది అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 78,827 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 30,117 క్యూసెక్కులు మొత్తం 1,08,971 వరద ప్రవాహం వస్తుంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 882.70 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలుగా కాగా ప్రస్తుత నీటి నిల్వ 202.9673 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,630 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,540 క్యూసెక్కుల, డ్యామ్ క్రస్టుగేట్ల ద్వారా 1,89,133 క్యూసెక్కులు మొత్తం 2,57,303 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.



పైపైకి ఉల్లి ధర

కర్నూలు యార్డులో గరిష్ఠంగా రూ.2,820



కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 11: గతంలో ఇదే సీజన్‌లో ఉల్లి ధర పూర్తిగా తగ్గిపోయింది. రైతులు రవాణా ఖర్చులు గిట్టుబాటు అయ్యే ఆశ లేదంటూ కర్నూలు మార్కెట్ యార్డులోనే వ్యాపారులకు అమ్మకుండా వదిలిపోయిన సంఘటనలు జరిగాయి. అయితే.. ప్రస్తుతం ఉల్లి ఘాటెక్కింది. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులో వివిధ ప్రాంతాల నుంచి రైతులు 111 క్వింటాళ్ల ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. క్వింటానికి గరిష్ఠ ధర అత్యధికంగా రూ.2,820, మధ్యస్థ, కనిష్ఠ ధర రూ.2,740 అమ్ముడుపోయినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్ తెలిపారు. తాము ఆశించిన ధర అందుతుందో లేదోనని ఆందోళన చెందామని, అయితే.. ఊహించని విధంగా ధర దక్కుతుండటంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా కందులపై గరిష్ఠ ధర రూ.10,109, మధ్యస్థ, కనిష్ఠ ధర రూ.5,179కు ధర దక్కడం రైతుల్లో సంతోషం కలిగించింది. వేరుశనగలకు గరిష్ఠ ధర రూ.7,190, మధ్యస్థ ధర రూ.5890, కనిష్ఠ ధర రూ.2,222 రైతులకు దక్కింది. కొర్రలు గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధర క్వింటానికి రూ.3,629 పలికింది.

సంగమేశ్వరంలో కృష్ణమ్మ పరవళ్లు

ఆత్మకూరు, ఆగస్టు 11: సప్తనదుల సంగమేశ్వరం కృష్ణమ్మ పరవళ్లతో తొణికిసలాడుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీశైల జలశయానికి గరిష్ఠస్థాయిలో నీటినిల్వలు వచ్చిచేరడంతో సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్‌ను వరదజలాలు ముంచెత్తుతున్నాయి. ఆదివారం సాయంత్రం 6గంటల సమయానికి శ్రీశైల జలశయానికి ఎగువ జూరాల, సుంకేసుల నుంచి భారీగా వరద పోటెత్తింది. దీంతో సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్ చివరి మెట్ల వరకు వరదజలాలు వచ్చిచేరాయి. ఈఅద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు సందర్శకులు సంగమేశ్వరానికి తరలివస్తున్నారు.

ఎగువ పుష్కరఘాట్‌ను ముంచెత్తుతున్న వరద



ఎగువ పుష్కరఘాట్ వరకు చేరిన వరదజలాలు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ జి.రాజకుమారి



నంద్యాల (కల్చరల్), ఆగస్టు 11: నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి ఆ నెల 5వ తేదీ ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.

ఆళ్లగడ్డ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

రికార్డుల పరిశీలన

నంద్యాల క్రైం/ఆళ్లగడ్డ, ఆగస్టు 11 : జిల్లాలోని ఆళ్లగడ్డ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, సీసీసీ ఫిర్యాదుల వివరాలు, సీసీ కెమెరాల పనితీరు, పర్యవేక్షణ, వివిధ క్రైం రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. బాధితులకు భరోసా కల్పించేలా వ్యవహరించాలని సూచించారు. బ్లాక్ స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి నేరాలను కట్టడిచేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైం ఎగైనెస్ట్ ఉమెన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సీఆర్‌పీసీ తదితర కేసుల రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసులు వాటి స్థితిగతులను తెలుసుకున్నారు. నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు, వాటి పురోగతిపై ఆరా తీశారు. నిందితులు అరెస్టుకాని కేసుల్లో త్వరగా నిందితులను అరెస్ట్ చేయాలని ఆదేశించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్, భూ తగాదాలు, పాత గొడవలు, నాటుసారా అమ్ముతున్నారన్న అనుమానం వున్న వ్యక్తులను గుర్తించి బైండోవర్ చెయ్యాలన్నారు. సైబర్ నేరాలు, లోన్ యాప్‌ల మోసాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్, మహిళలపై జరిగే నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో నేరాలపై స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, ఎస్సీ సీసీ నాగరాజు, ఆళ్లగడ్డ టౌన్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి, సబ్ ఇన్‌స్పెక్టర్ నగీన పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



ఎన్నికల్లో అధికారి అవినీతి

సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ఓ అధికారికి కాసుల వర్షం కురిపించింది. ఎన్నికల నిర్వహణ కోసం సంబంధిత శాఖ కేటాయించిన నిధుల్లో సదరు అధికారి చేతివాటం ప్రదర్శించి బాగానే వెనకేసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో కమీషన్లు దండుకోవటమే కాకుండా, పనులు చేసిన తర్వాత పెట్టే బిల్లుల్లోనూ మతలబు చేసినట్లు తెలుస్తోంది. ఓటరు జాబితాకు సంబంధించి ప్రింటర్ల దగ్గర నుంచి భారీగా కమీషన్లు దండుకోవటమే కాకుండా, ఎన్నికలకు ఉపయోగించిన సామగ్రిని సైతం అమ్ముకున్నట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో సంబంధిత సెక్షన్‌లోని ఓ మహిళా అధికారి చక్రం తిప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా మొత్తమ్మీద ఎన్నికల సమయంలో లక్షల రూపాయలు ఈ అధికారి కూడబెట్టినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఆరా తీస్తే అసలు నిజాలు బయటపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- ఎలక్షన్ ఫండ్‌లో చేతివాటం
- నియోజకవర్గాలకు కేటాయించిన మొత్తంలో కమీషన్లు
- బిల్లుల్లో అవకతవకలు
- ప్రింటర్ల వద్ద నుంచీ భారీగా వసూళ్లు
- ఎన్నికల సామగ్రి మాయం
- చక్రం తిప్పిన మహిళా అధికారి

నంద్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లా యంత్రాంగం కొంత మంది డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులకు జిల్లా కేంద్రంలో ఎన్నికల సెల్ విధులు కేటాయించింది. ఇందులో ఓ మహిళా డిప్యూటీ తహసీల్దారు స్థాయి అధికారి కూడా ఉన్నారు. ఇక ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చిన ఉన్నతాధికారి సదరు మహిళా అధికారికి ఎన్నికల ఫండ్, ఈవీఎం గోడౌన్ల బాధ్యతను అప్పగించారు. ఎన్నికల నిర్వహణ నిమిత్తం జిల్లాకు దాదాపు రూ.15 కోట్లు కేటాయించగా, జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి దాదాపు రూ.1.30 కోట్ల మేర నిధులు అందినట్లు ఈ అధికారికి తెలిసింది. దీంతో ఆమె కన్ను ఎన్నికల ఫండ్ మీద పడింది. మళ్లీ ఇలాంటి ఛాన్స్ వస్తుందో, రాదో అనుకొని భారీగా దండుకోవాలని ఆలోచించారు. ఎన్నికల నిర్వహణ కోసం వాడే ప్రతి రూపాయిలో కమీషన్ తీసుకున్నారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన సొమ్ము విడుదల చేసినందుకు ఒక్కో నియోజకవర్గం నుంచి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు కమీషన్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికీ కొన్ని నియోజకవర్గాలకు ఎన్నికల ఖర్చుల బిల్లులు పూర్తిస్థాయిలో విడుదల కాలేదు. వచ్చిన ఫండ్ సరిపోలేదని, మిగిలిన ఖర్చులకు సంబంధించిన నిధులు విడుదల చేయాలంటూ సంబంధిత అధికారులు మళ్లీ బిల్లులు పెట్టారు. ఈ బిల్లులు రూ. కోట్లలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మళ్లీ నిధులు విడుదలైన తర్వాత ఆయా నియోజకవర్గాలకు మంజూరు చేసే సమయంలో తనకు కమీషన్ అందేలా ముందుగానే సంబంధిత అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.



బిల్లుల్లో మతలబు..

ఎన్నికల నిర్వహణలోని వివిధ అవసరాలకు యంత్రాంగం డబ్బు ఖర్చులు చేస్తుంది. అయితే ఈ ఖర్చులు బిల్లుల రూపంలో పై అధికారులకు సమర్పించి సంతకాలు చేయించాలి. ఆ తర్వాతే పెట్టిన ఖర్చులకు డబ్బులు ఆయా కాంట్రాక్టర్లకు విడుదల కావు. అయితే ఈ మహిళా అధికారి ఇందులో బాగానే అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోంది. బిల్లులను కలర్ కాపీలు రెండు మూడేసి తీయించి తన వద్ద పెట్టుకున్నారు. మొదట సంబంధిత ఖర్చును బిల్లు బుక్కులో రాసి ఆ బిల్లును అధికారులకు సమర్పించేవారు. ఆ తర్వాత బిల్లులో తేడా జరిగిందని తన వద్ద ఉన్న కలర్ కాపీ బిల్లుల్లో అంకెలు మార్చి మరోసారి ఉన్నతాధికారుల నుంచి సంతకాలు తీసుకునేవారు. ఈ బిల్లును పనులు చేసిన కాంట్రాక్టరకు ఇచ్చి, ఎక్కువ మొత్తంలో చూపిన ఖర్చు తనకు అందేలా చూసుకునేవారు. ఎవరైనా బిల్లులను తనిఖీ చేసినా.. మొదట బిల్లు వాస్తవ ఖర్చులనే చూపించవచ్చు కాబట్టి బిల్లుల్లో జరిగిన అవకతవకలు బయటపడే అవకాశం ఉండదు. ఈ విషయం సదరు అధికారికి బాగా తెలుసు కాబట్టి బిల్లుల్లో మతలబులు చేసి భారీగానే అక్రమార్జన చేసినట్లు తెలుస్తోంది.

ప్రింటర్ యజమానుల నుంచి..

ఓటర్ల నమోదు, తొలగింపు వంటివి పూర్తయిన తర్వాత ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూనుకుంటుంది. ఈ సంవత్సరం కూడా అలాగే చేసింది. జిల్లాలోని ఓటరు జాబితా ప్రింటింగ్ బాధ్యతను రెండు ప్రింటింగ్ దుకాణాలకు అప్పగించింది. ఈ రెండు దుకాణాలకు బిల్లుల మంజూరు విషయంలో కూడా సదరు అధికారి చేతివాటం బాగానే చూపించినట్లు తెలుస్తోంది. ప్రింటింగ్ దుకాణాల యజమానులను మచ్చిక చేసుకుని ఒక్కొక్కరి నుంచి దాదాపు రూ.4 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇక ఇవి చాలవన్నట్లు ప్రభుత్వం అందించిన ఇంధన కూపన్లను కూడా సొంతానికి వాడుకున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, ఇతర అధికారులు ఆయా నియోజకవర్గాలకు తిరుగుతుంటారు. వారి ప్రయాణ ఇంధన ఖర్చుల కోసం ఈ అధికారి డబ్బులు కాకుండా, కూపన్లు అందజేశారు. ఓ ప్రభుత్వ శాఖ జిల్లా కేంద్రంలో నిర్వహించే పెట్రోలు బంకులో ఈ కూపన్లను అందజేస్తే అధికారుల వాహనాల్లో ఇంధనం నింపుతారు. అయితే ఇవి పూర్తిగా ప్రభుత్వ పనుల మీద వెళ్లినపుడు మాత్రమే ఉపయోగించాలి. కానీ సదరు అధికారి మాత్రం తన సొంత అవసరాల నిమిత్తం ఊళ్లకు, ఆస్పత్రులకు వెళ్లినప్పుడు ఈ కూపన్లను ఉపయోగిస్తున్నారు. ఇలా తన సొంత ఖర్చులను ప్రభుత్వం మీద రుద్దుతున్నారు. మొత్తమ్మీద ఈ ఎన్నికల పుణ్యమా అని భారీగానే ఆమె డబ్బులు కూడబెట్టుకున్నారని తోటి ఉద్యోగులే చెవులు కొరుక్కుంటున్నారు!

ఎన్నికల సామగ్రి ఏమయింది..?

ఎన్నికల వేళ, ఓట్ల లెక్కింపు వేళ స్టేషనరీ ఖర్చు భారీగా ఉంటుంది. డ్రమ్ములు, టబ్బులు, పేపర్లు.. ఇలా వివిధ వస్తువులు కొనాల్సి ఉంటుంది. వీటిలో చాలా వరకు ఆ సందర్భానికి వాడుకున్న తర్వాత మరలా వాడుకోవటానికి పనికి రావు. కానీ డ్రమ్ములు, టబ్బులు, ఇతరత్రా సామాన్లు మళ్లీ వాడుకోవచ్చు. ఎన్నికల వేళ ఇలాంటివి ఎక్కువగానే కొన్నారు. అయితే ప్రస్తుతం అవేమీ కనిపించడం లేదని తెలుస్తోంది. వీటిని సదరు అధికారి అమ్ముకుని సొమ్ములు చేసుకున్నట్లు సమాచారం. ఇదంతా పై అధికారులకు తెలియకుండానే జరుగుతోందా? లేక ఇందులో వారికీ వాటా ఉండటంతోనే పట్టించుకోలేదా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఈ విషయం పైన ఉన్నతాధికారులు దృష్టి సారించి అసలేం జరిగింది? ఎన్నికల వేళ ఎంత మేర ప్రభుత్వ ధనం పక్కదారి పట్టింది? ఎన్నికల సామాగ్రి ఏమయింది? అని ఆరా తీస్తే అసలు లెక్కలు బయటపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శ్రీమఠంలో అన్నదానానికి రూ.2 లక్షల విరాళం



పీఠాధిపతితో కోనంకి కిష్టప్ప, నాగరత్నమ్మ, కుటుంబ సభ్యులు

మంత్రాలయం, ఆగస్టు 11: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బళ్లారికి చెందిన కోనంకి కిష్టప్ప, నాగరత్నమ్మ అనే దంపతులు రూ.2 లక్షల విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానానికి రూ. 2 లక్షల నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ ఓబులయ్య, కిషోర్, కావ్య, సహస్ర పాల్గొన్నారు.

కిక్కిరిసిన భక్తులు



శ్రీ మఠం ప్రాంగణంలో భక్తులు రద్దీ

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మఠం సందడిగా మారింది. రెండో శని, ఆదివారం సెలవు దినాలు కావటంతో దక్షిణాది నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు.

కొడుకు మాట వినలేదని తండ్రి ఆత్మహత్య



సిద్దరామప్ప(ఫైల్)

ఆదోని రూరల్, ఆగస్టు 11 : చెప్పిన మాట కొడుకు వినలేదని ఓ తండ్రి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన ఉల్లిగడ్డల సిద్దరామప్ప(53) ఆదోనిలోని శ్రీ ఓమ్స్ కాలనీలో ఉంటున్నాడు. సిద్దరామప్పకు భార్య చిన్న లింగమ్మ, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో రెండో కుమారుడికి పెళ్లి చేయాలని మూడు, నాలుగేళ్లుగా పెళ్లి చూపులు చూస్తున్నా ఒప్పుకోవడం లేదు. ఈ క్రమంలోని శనివారం రాత్రి తాను ప్రేమ పెళ్లి చేసుకుంటానని చెప్పుకుంటానని కొడుకు చెప్పడంతో సిద్దరామప్ప మనస్థాపానికి గురయ్యాడు. వైసీఆర్ టౌన్‌షిప్ సమీపంలో ఉన్న పంట పొలంలోకి వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా ఎస్‌ఐ ఎర్రిస్వామి తెలిపారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా కమిటీ

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 11: ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆదివారం వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు సంఘం జిల్లా కార్యవర్గాన్ని సభ్యులంతా పరస్పర సహకారంతో ఏకగ్రీవంగా చేసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా కే.రవిప్రకాష్, జిల్లా కార్యదర్శిగా ఎంసీ కాశన్న, జిల్లా కోశాధికారిగా బి.నాగ కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు పర్యవేక్షక అధికారిగా ఎం.వెంకటేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారిగా రమేష్, ఎలక్షన్ అబ్జర్వర్‌గా ఎస్ఎన్ శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

16 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

- సెప్టెంబరు 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఏఎస్
- జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరించనున్న జాయింట్ కలెక్టర్
- పిటీషన్ల వివరాలు ఐదు రిజిస్టర్లలో నమోదు
- హాజరు కానున్న ఏడుగురి కమిటీ సభ్యులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 11: ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండలాలు, మున్సిపాలిటీల్లో మీ కోసం-ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలపై రైతులు ఎక్కువగా ఫిర్యాదు చేస్తున్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో కూడా భూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోని ప్రభుత్వ భూములు, రైతుల భూములు భూకబ్జాలకు, భూఆక్రమణలకు గురయ్యాయి. దీంతో కూటమి ప్రభుత్వం రైతుల భూముల సమస్యల పరిష్కారం కోసం గ్రామ రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30 వరకు ప్రతి గ్రామంలో జరిగే గ్రామ రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి సదస్సుల నిర్వహణకు, పర్యవేక్షణకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించనున్నారు. అదే విధంగా జిల్లాలోని నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్‌ను నియమించనున్నారు. గ్రామాల్లో జరిగే గ్రామ రెవెన్యూ సదస్సుకు ఏడుగురు కమిటీ సభ్యులు తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్ శాఖల ప్రతినిధులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారి, అటవీశాఖ అధికారులు పాల్గొంటారు. భూ సమస్యల ఫిర్యాదులను 45 రోజుల్లో అధికారులు పరిష్కారం చేయనున్నారు. 15న జిల్లాలోని మంత్రులు గ్రామ రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మండలాలవారీగా గ్రామాల్లో సదస్సుల నిర్వహణ తేదీలను మంగళవారంలోపు కలెక్టర్ ప్రకటించను న్నారు.

బాధితుల నుంచి పిటీషన్ల స్వీకరణ

భూ కొలతల్లో తేడా, సర్వే నెంబర్లలో మార్పులు, వారసత్వం పేర్ల నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డులలో నమోదైన తప్పులు, భూకబ్జాలు, భూఆక్రమణలు, అసైన్డ్, చుక్కల భూములు తదితర అంశాలపై బాధితుల నుంచి పిటీషన్లు అధికారులు స్వీకరించనున్నారు. మ్యుటేషన్, కౌలు రైతు కార్డులు, భూమి వివాదాలు, భూ ఆక్రమణ, నిషేధిత జాబితా 22(ఏ) గోల్‌మాల్ రిజిస్టర్లలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేస్తారు.

పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న కలెక్టర్



ఆకర్ష్, సంయమ కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

ఓర్వకల్లు, ఆగస్టు 11 : పూర్వ విద్యార్థులతో తన పాత జ్ఞాపకాలను కలెక్టర్ పి.రంజిత్‌బాషా నెమరువేసుకున్నారు. ఆదివారం కాల్వబుగ్గ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం ఆకర్ష్ సంయమ 1992-1998 వ బ్యాచ్ 11వ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆకర్ష్ సభ్యుడుత కలెక్టర్ పి. రంజిత్‌బాషా హాజరయ్యారు. అంతకుముందు ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో తాను పదో తరగతి వరకు చదువుకున్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మీరు ఎలా ఉన్నారు, ఎవరెవరు ఎక్కడ స్థిరపడ్డారు, ఏ వృత్తిలో ఉన్నారనే విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. తన బాల్యాన్ని, గురువులతో ఉన్న బంధాన్ని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. ఆకర్ష్ సంయమ చేసే కార్యక్రమాలు బాగున్నాయని కొనియాడుతూ కలెక్టర్‌గా తాను చదివిన పాఠశాలకు తగిన సేవ చేస్తానన్నారు. ప్రతి ఏటా పది మంది విద్యార్థులకు ఆకర్ష్ స్కాలర్ షిప్స్, ఆరుగురు విద్యార్థులకు ప్రతిభ అవార్డులు, స్పోర్ట్స్ మీట్, చిత్రలేఖనం, శ్రీశ్రీ సాహిత్య పురస్కారాల ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఆకర్ష్ సభ్యులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆకర్ష్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు గల్లంతు

నదిలో గాలిస్తున్న పోలీసులు, బంధువులు



శేషన్న (ఫైల్)

పగిడ్యాల, ఆగస్టు 11: జీవనోపాధి కోసం కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లి పుట్టి పల్టీ కొటిన సంఘటనలో శేషన్న(60) గల్లంతయ్యాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన బండారు శేషన్న 20 ఏళ్లకు పైగా చేపలు పడుతూ, నదిలో నీరు తగ్గిన సమయంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం చేపలు పట్టుకునేందుకు నదిలోకి పుట్టిలో బయలుదేరారు. అలల తాకిడికి పుట్టి ప్రమాదవశాత్తు పల్టీ కొంటడంతో శేషన్న నదిలో పడిపోయాడు. నది సమీపంలో ఉన్న కొంత మంది శేషన్న పడిపోవటం గమనించారు. అతడ్ని కాపాడేందుకు ఇంజన్ బోట్లలో బయలుదేరినప్పటికీ అప్పటికే నీటిలో గల్లంతైనట్లు తెలిపారు. ఈ విషయాన్ని ముచ్చుమర్రి ఎస్‌ఐ గంగయ్యకు తెలపడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బంధువుల సహాయంతో కృష్ణానదిలో గాలిస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ గంగయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఓర్వకల్లు, ఆగస్టు 11: మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన షేక్ రెహినాబీ (50) అనే మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. శనివారం తన ఇంటి వద్ద ఎరువుల సంచులు కడిగి వాటిని తీగపై ఆరబెడుతూండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతురాలి భర్త పెద్ద ఖాజామియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

తుగ్గలి, ఆగస్టు 11: వేరుశనగ పంట తొలగిస్తుండగా.. పాము కాటుకు గురై రైతు కోటకొండ వీరాంజనేయులు (48) మృతి చెందాడు. ఆదివారం మండలంలోని లింగనాయనదొడ్డికి చెందిన కోటకొండ వీరాంజనేయులు శనివారం నునుసరాళ్ల గ్రామ పొలాల్లో వేరుశనగ పంట తొలగిస్తుండగా.. పాము కరిచింది. ఆయన్ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పత్తికొండ వైద్యశాలకు తరలించారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు దర్యాప్తు చేస్తున్నామని తుగ్గలి ఎస్‌ఐ జహీర్ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. టీడీపీ నాయకులు తలారి రాముడు, మోహన్, రామారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కర్ణాటక మద్యం పట్టివేత

నందవరం, ఆగస్టు 11: మండల పరిధిలోని నాగలదిన్నె బ్రిడ్జి దగ్గర కర్ణాటక మద్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎమ్మిగనూరు రూరల్ సీఐ విక్రమ్‌సింహ, ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. బ్రిడ్జి దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక ప్రాంతమైన తలమారి నుంచి 10 బాక్స్‌లను బైక్‌పై తీసుకు వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ ప్రాంతమైన పులికల్ గ్రామానికి చెందిన సుంకన్న, బోయ తాయన్నలపై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు వారు తెలిపారు.

నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 11: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన అన్నదాత సుఖీభవ పథకాన్ని ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం మిడ్తూరు మండల కేంద్రంలో రైతు సంఘం మండల నాయకుల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తి, మొక్కజొన్న, కంది, కొర్ర, మినుము, ఉల్లి, మిరప తదితర పంటలు వేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా పథకానికి ప్రత్యామ్నాయంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కంటేపోగు స్వామన్న, నాగశేషులు, మద్దిలేటి, ఓబులేసు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బుడ్డా వెంగళరెడ్డి సేవలు ఎనలేనివి



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

వెలుగోడు, ఆగస్టు 11: మాజీ మంత్రి బుడ్డా వెంగళరెడ్డి సేవలు ఎనలేనివని టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, అబ్దుల్ కలాం, యుగంధర్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని వేల్పనూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, వెలుగోడు టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుడ్డా వెంగళరెడ్డి, ఎమ్మెల్యేగా మంత్రిగా ఎనలేని సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్‌హంజా, శంకర్‌రెడ్డి, రఘుస్వామి రెడ్డి, లింగమయ్య గౌడ్, వెంకటేశ్వర్లు, గోకారి, జాషువా తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు కోల్పోరాదు



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, అతిథులు

పాణ్యం, ఆగస్టు 11: విద్యార్థులు మానవతా విలువలు కోల్పోరాదని కొచ్చిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు యూనివర్సల్ హ్యూమన్ వ్యాల్యూస్‌పై జరిగిన సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సదస్సులో 110 మంది ఆర్జీఎం అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ... మానవ హక్కులు, సమానత్వం, సానుభూతి, సామాజిక బాధ్యతలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డాక్టర్ మహేశ్వరమ్మ, డాక్టర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి వెండి నాగపడగ



ఈఓకు వెండి నాగపడగను అందజేస్తున్న భక్తులు

పాణ్యం, ఆగస్టు 11: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు వెండి నాగపడగను సమర్పించారు. ఆదివారం కర్నూలు కు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు వి.నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు తమ ఇలవేల్పు కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కిలో వెండి నాగపడగను ఆలయ ఈఓ రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులచే స్వామివారికి అభిషేకము, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు. దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో స్వాతి వేడుకలు



నంద్యాల (కల్చరల్) ఆగస్టు 11: నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి సందర్భంగా స్వాతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం, స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి నైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీరామమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నందికొట్కూరు, ఆగస్టు 11: నందికొట్కూరులో కబ్జాలకు గురైన భూములకు రక్షణ కల్పించి, కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో జరిగిన అవకతవకలు, నిషేధిత జాబితాలోని స్థలాల రిజిస్ట్రేషన్లు ఫారెస్టు, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన భూములపై విచారణ చేయాలంటూ కేబినేట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించడం శుభపరిణామమన్నారు. నందికొట్కూరు పట్టణంలోని తన నివాసంలో బైరెడ్డి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కబ్జాదారులకు చంద్రబాబు నాయుడు ఆక్రమిత భూములపై విచారించేందుకు నిర్ణయం తీసుకోవడంతో రెండు జిల్లాలోని అక్రమార్కులకు నేటి నుంచి గుండెల్లో దడ మొదలైందన్నారు. నిజానిజాలను తేల్చేందుకు ఆర్ఐలు, తహసీల్దార్లు, ఫారెస్టు అధికారులు, ఇరిగేషన్ అధికారులు సభ్యులుగా ఉంటూ విచారించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధితులు కూడా ఆ కమిటీ విచారణకు వచ్చిన సమయంలో సరైన ఆధారాలతో విచారణకు హాజరు కావాలని ఆయన సూచించారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఒకరి పేరుమీద ఉన్న భూములను మరొకరి పేరున రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. ఇలాంటి వాటిపై విచారణ జరుగుతుందన్నారు. నందికొట్కూరు పట్టణంలో మారుతినగర్, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్, బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లోను ఇచ్చిన ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురయ్యాయన్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చి వాటిని కబ్జాలు చేశారన్నారు. నిషేధిత భూములను కూడా సర్వే నెంబర్ మార్చి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. పాండురంగస్వామి దేవాలయానికి గ్రామ పంచాయతీ తీర్మానంతో కొంత భూమిని కేటాయించామన్నారు. దేవాలయం నిర్మించుకోగా మిగిలిన స్థలంలో ఆలయకమిటీతో కొందరు లీజుకు తీసుకొని షెడ్లు వేసుకొన్నారు. కొందరు ఎర్రకండువాలు వేసుకోని వస్తే భయపడేది లేదని, పాండురంగస్వామి భక్తుల జోలికి వెళ్లితే వదిలిపేట్టేది లేదని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, గుణశేఖర్‌రెడ్డి, అబ్దుల్ సుకూర్, కౌన్సిలర్ చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

- ఆదివారం ఉదయం నందికొట్కూరు పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయం వద్ద బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఈ సమయంలో సీపీఎం నాయకులు దేవాలయం ముందున్న స్థలంలో కొందరు కార్మికులు షెడ్డు వేసుకొని జీవనం కొనసాగించేవారని, మున్సిపల్ అధికారులు వాటిని తొలగించారని, ఇప్పుడు పాండురంగస్వామి దేవాలయం కమిటీ సభ్యులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. దేవాలయానికి కేటాయించన స్థలంపై వివాదం సరికాదంటూ బైరెడ్డి వారిని వారించారు.

ముమ్మరంగా నేర నియంత్రణ చర్యలు

ఎస్పీ ఆదేశాలతో రాత్రి వేళ గస్తీ

నంద్యాల క్రైం, ఆగస్టు 11 : జిల్లాతో పాటు నంద్యాల పట్టణంలో నేరాలను నివారించేందుకు పోలీసులు ముమ్మర చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలతో రాత్రివేళ పకడ్బందీగా గస్తీ విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి పూట గస్తీలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అనుమానిత వాహనాల తనిఖీలు, వాహనాల రికార్డుల పరిశీలన, ప్రయాణికులను తనిఖీ చేస్తున్నారు. అనుమానిత వ్యక్తుల వివరాలతోపాటు వారి వేలిముద్రలు సేకరించి దొంగతనాలు జరగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ రవాణా, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. నైట్ బీట్ అధికారులు నిరంతరం బీట్ పాయింట్స్ తనిఖీ చేసి, ప్రార్థనాలయాలు, ఏటీఎంలు, వ్యాపార సముదాయాలవద్ద సిబ్బందిని అప్రమత్తం చేస్తూ నేరాలకు ఆస్కారం లేకుండా గస్తీ విధులు నిర్వహిస్తున్నారు. హైవేల్లో డయల్ 100, హైవే మొబైల్స్ వాహనాల ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా నిద్రమత్తులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు ఫేస్ వాష్ చేసుకుని వెళ్లేలా స్టాఫ్ అండ్ ఫేస్ వాష్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. డార్మిటరీ, లాడ్జీలలో కొత్త వ్యక్తుల వివరాలు సేకరించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. నైట్ బీట్లలో భాగంగా వారి బీట్లలో గల నేర చరిత్ర గలవారని తనిఖీ చేస్తూ వారి కదలికలపై నిఘా ఉంచుతున్నట్లు పోలీసులు తెలిపారు. బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రదేశాల్లో కొత్తవారి కదలికలపై నిఘా ఏర్పాటు చేస్తూ నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించాయి. సరైన కారణం లేకుండా అర్ధరాత్రి వేళ తిరిగే అల్లరిమూకలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా పోలీస్ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. సరైన కారణం లేకుండా ఎవరూ రాత్రివేళల్లో రోడ్లపైకి రావొద్దని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ప్రజలకు సూచించారు.



నంద్యాలలో సిబ్బంది గస్తీని పర్యవేక్షిస్తున్న సీఐ ఇస్మాయిల్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఏపీటీఎఫ్

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 11: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధు సూదన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని ఏపీటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జులై 20. 23 నుంచి కొత్త పీఆర్సీ అమలులోకి రావాల్సి ఉండగా గత ప్రభుత్వం అందుకు తగిన ఏర్పాట్లు చేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. నివేదిక ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున మధ్యంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో విద్యారంగంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళే విధంగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని, బోధనకు ఆటంకంగా ఉన్న యాప్‌లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవ స్వామి, నగిరి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ మహబూబ్ బాస్, పుల్లయ్య, లింగమయ్య, రవి తదిరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు

నంద్యాల ట్రాఫిక్ సీఐగా మల్లికార్జున గుప్త



నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 11: నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐగా మల్లికార్జున గుప్త ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవలే పోలీస్ శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సీఐల సాధారణ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లా వీఆర్‌లో ఉన్న మల్లికార్జున గుప్త ట్రాఫిక్ సీఐగా ఉన్నతాధికారులు నియమించారు. గతంలో ఈ స్టేషన్‌లో పని చేసిన సీఐ ఇస్మాయిల్ ప్రస్తుతం నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. సీఐ మల్లికార్జునగుప్త 1995 బ్యాచ్‌కు చెందిన పోలీస్ అధికారి. నంద్యాలలోని ట్రాఫిక్ సమస్యల పరిష్కారం పై దృష్టి సారిస్తామని, ప్రజలు, వాహనదారులు ఇందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



మహానందీశ్వరుడి దర్శనానికి క్యూలైన్లో భక్తులు

మహానంది, ఆగస్టు 11: మహానంది క్షేత్రంలో భక్తుల రద్దీ ఆదివారం కూడా కొనసాగింది. సెలవు రోజు కావడంతో మహానందికి వేలాదిమంది భక్తుల పరమశివుని దర్శనం కోసం తరలి వచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధులు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రధాన గర్భాలయంలోకి వెళ్ళే భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో వెళ్లాలని ఈఓ భక్తులను కోరారు. ఆదివారం రాత్రి వరకు క్షేత్ర పరిసరాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పగిడ్యాల, ఆగస్టు 11: పగిడ్యాల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కె.కవిరాజ్ బదిలీ కావడంతో జడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య, కార్యాలయ సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీడీఓగా కవిరాజ్ నిక్కచ్చిగా వ్యవహరించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపారన్నారు. ఎంతోమంది యువతకు ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేషన్న, మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, ఎంఈవో సుభాన్, ఈవోఆర్డీ నాగేంద్రమయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి ఎంపీడీవోగా మేరీ

కొత్తపల్లి, ఆగస్టు 11: కొత్తపల్లి ఎంపీడీవోగా దాసరి మేరీని బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె గతంలో కొత్తపల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు వెళ్లారు. తిరిగి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీన ఆమె కొత్తపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

నేడు 'హర్ ఘర్ తిరంగా'

నంద్యాల (కల్చరల్) ఆగస్టు 11: నంద్యాల వివేకానంద ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 గంటలకు హర్‌ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 'విభజన విభీషక దివస్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్లు నాగరాజు, అరవిందరెడ్డి, రామకృష్ణా రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బీజేపీ కోఆర్డినేటర్ డాక్టర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా డాక్టర్ ఆదినారాయణ పాల్గొంటారన్నారు.

ప్రశాంతంగా నీట్ పరీక్షలు

పాణ్యం, ఆగస్టు 11: నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్) పీజీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో 248 మందికి గాను 13 మంది గైర్హాజరైనట్లు టెస్ట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సుబ్బారెడ్డి తెలిపారు. శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో వంద మందికి గాను ఒకరు గైర్హాజరైనట్లు టెస్ట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ రియాజ్ నాయక్ తెలిపారు.

సీతారామపురంలో గొడవ.. కేసు నమోదు

మహానంది, ఆగస్టు 11: మండలంలోని సీతారామపురంలో పొలం తగాదా విషయంపై జరిగిన గొడవలో ఆదివారం ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన వైసీపీ కార్యకర్త సుబ్బరాయుడు హత్యలో ముద్దాయిగా ఉన్న పుల్లారెడ్డి భార్య నిర్మలతో పొలం వద్ద నందిపల్లెకు చెందిన వెంకటరెడ్డి అనే వ్యక్తి గొడవ పడ్డాడు. దీంతో బాధితురాలు నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిటకిటలాడిన కొత్తూరు దేవస్థానం

పాణ్యం, ఆగస్టు 11: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం మొదటి ఆదివారం కావడంతో భక్తులుపెద్దఎత్తున స్వామివారిని దర్శించుకోవడానికి ఆలయానికి చేరుకున్నారు. భక్తుల రద్దీ అదుపులో ఉంచడానికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన, తీర్థప్రసాదాలు అందజేశారు.



స్వామివారికి అభిషేకాలు, దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

క్రిష్టియన్ మైనారిటీల
సమస్యలు పరిష్కరిస్తాం : టీడీపీ



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 11: క్రిష్టియన్ మైనారిటీల సమస్యలను పరిష్కరిస్తామని టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. ఆదివారం నంద్యాలలోని కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు సతీష్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరాధన కార్యక్రమంలో ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆయనను ఆశీర్వదించారు. క్రిష్టియన్ మైనారిటీల మద్దతుతో ఎన్ఎండి ఫరూక్ భారీ మెజార్టీతో గెలిచి మంత్రి అయ్యారని గుర్తు చేశారు. క్రిష్టియన్లకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృపాకర్, తెలుగుదేశం పార్టీ నాయకులు జోసఫ్, జార్జి, శరత్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అవయవ దానంపై అవగాహన



బ్యానర్‌ను విడుదల చేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ప్రతినిధులు

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 11: అంతర్జాతీయ అవయవదాన దినోత్సవ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు శాంతిరాం మెడికల్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ దస్తగిరి తెలిపారు. శాంతిరాం కళాశాల ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంపై ఆదివారం దస్తగిరితో పాటు వైస్ ఛైర్మన్ మారుతి కుమార్, ఉస్మాన్ బాషా తదితరులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవయవదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరవుతున్న కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా అవయవదానం చేసిన కుటుంబ సభ్యులకు, చనిపోయిన అనంతరం వైద్య కళాశాలకు శరీర దానం చేయడానికి అంగీకరించిన వారిని సన్మానించడం జరుగుతుందని తెలిపారు.

ట్యాంక్‌పై నుంచి దూకి మహిళ ఆత్మహత్య

ఆత్మకూరు, ఆగస్టు 11: ఆత్మకూరు పట్టణంలోని అక్కిరాజు కాలనీకి చెందిన ఖైరూన్‌బీ(60) అనే మహిళ వాటర్ ట్యాంకుపై నుంచి దూకి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అక్కిరాజుకాలనీకి చెందిన దివంగత షేక్ ముర్తుజా సతీమణి ఖైరూన్‌బీ కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయిబాబానగర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ వాటర్ ట్యాంకును ఎక్కి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

మల్యాల తలారి మృతి

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 4: మండలంలోని మల్యాల గ్రామంలో మహిళా తలారిగా విధులు నిర్వహిస్తున్న లాల్‌బీ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో నందికొట్కూరు రెవెన్యూ అధికారులు లాల్‌బీ మృతదేహానికి నివాళులర్పించారు. ఇదిలా ఉండగా రెవెన్యూ అధికారులు రూ.25వేలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు రూ.5వేలు అందజేశారు. నివాళులర్పించిన వారిలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు జక్కుల మహేష్, శివన్న, పవన్ కుమార్, ముర్తుజావలి, శంకర్, మద్దయ్య తదితరులు ఉన్నారు.

'టీడీపీలోనే పొదుపు సంఘాలకు జీవం'

ఓర్వకల్లు, ఆగస్టు 11: పొదుపు సంఘాలకు జీవం పోసిన చంద్రబాబు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేశారని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఓర్వకల్లు మండలంలోని హుశేనాపురంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గత వైసీపీ పాలనలో పొదుపు మహిళల స్థితిగతులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

దుద్యాల హైస్కూల్‌లో
ఉపాధ్యాయుల కొరత

- విద్యార్థులకు తప్పని తిప్పలు



దుద్యాల జిల్లా పరిషత్ హైస్కూల్

కొత్తపల్లి, ఆగస్టు 11: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని క్షేత్రస్థాయిలోని ప్రభుత్వం చెబుతున్నా ఉపాధ్యాయులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల స్థాయికి తగ్గట్లుగా ఉపాధ్యాయులను నియమించక పోవడం వల్ల విద్యలో నాణ్యతప్రమాణాలు కొరవడుతున్నాయి. కొత్తపల్లి మండలంలోని దుద్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఈ పాఠశాలలో గతంలో ప్రధానోపాధ్యాయులు గత నాలుగు నెలల క్రితం పదవి విరమణ పొందడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది. అలాగే తెలుగు సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా పదవి విరమణ పొందారు. అలాగే ఇంగ్లీషు సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయులు అనారోగ్యంతో మృతి చెందడంతో ఈ పోస్టు కూడా ఖాళీగా ఉంది. అలాగే అటెండర్, రికార్డు అసిస్టెంటు, క్లర్క్ పోస్టు కూడా ఖాళీగా ఉన్నాయి. ఈ పాఠశాలలో సుమారు 350 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం ఏమో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని చెబుతున్నారే గానీ, అందుకు తగ్గట్లు ఉపాధ్యాయులను నియమించకపోవడం వల్ల విద్యార్థులు చదువులో వెనుకపడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రధాన సబ్జెక్టుల కు సంబంధించిన ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి క్షేత్ర స్థాయిలో మండలంలో ఉపాధ్యాయులను నియమించి ఖాళీ పోస్టులను భర్తీ చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని తల్లి దండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి హెచ్ఎం కృష్ణమోహన్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుల కొరత ఉన్నది నిజమే అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

క్రీడా పోటీలు ప్రారంభం


చాగలమర్రిలో ఫోర్‌లైన్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న స్వర్ణకారుల సంఘ అధ్యక్షుడు అమీర్‌బాషా

చాగలమర్రి, ఆగస్టు 11: స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా ముందస్తుగా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వివిధ క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు చాగలమర్రిలోని రాయల్ కేఫ్ సమీపంలోని క్రీడా మైదానంలో ఫోర్‌లైన్ క్రికెట్ పోటీలను మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు అమీర్‌బాష, ప్రధాన కార్యదర్శి గౌస్‌మొద్దీన్‌లు ప్రారంభించారు. పీడీ దాదాపీర్ మాట్లాడుతూ స్వర్ణకారులకు క్రికెట్, చెస్, క్యారమ్స్, సెటిల్ బ్యాట్మింటన్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘ సభ్యులు బాషా, షఫి, గౌస్, సాదక్, వలి, మాలిక్‌బాషా, వాజిద్, మన్సూర్, కరిమ్, ఆరిఫ్, క్రీడాకారులు ఉన్నారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం

చాగలమర్రి, ఆగస్టు 11: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు రామతీర్థం అన్నారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ప్రజలకు భరోసా నింపిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు సూపర్-6 పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని అన్నారు. బీసీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, పీరయ్య, లాలయ్య, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

ధర్మప్రచారం అందరి బాధ్యత

చాగలమర్రి, ఆగస్టు 11: ధర్మప్రచారం అందరి బాధ్యతని అభినవ శంకరానందస్వామి అన్నారు. ఆదివారం చాగలమర్రి శివరామానంద ఆశ్రమంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూవుల సాంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు దైవ మార్గంలో నడవాలని, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు.

16న వరలక్ష్మి వ్రతం

చాగలమర్రి, ఆగస్టు 11: మండలంలోని వెల్లాల క్షేత్రంలో 16న సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నర్సయ్య ఆదివారం తెలిపారు. చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్నామని అన్నారు. సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొనే భక్తులకు అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు, రవిక, ప్రసాదం అందజేయబడుతుందని అన్నారు. కార్యక్రమం లో కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు


చౌడేశ్వరిదేవికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఆగస్టు 11: చాగలమర్రి గ్రామంలోని చౌడేశ్వరి, చాగలమ్మ, గంగమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో ఆదివారం శ్రావణ శుద్ధ సప్తమి సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా అమ్మవార్లకు పండ్లు, పూలు, సారె సమర్పించి పూజలు చేశారు. వరుణ దేవుడు కరుణించి పంటలు సుభిక్షంగా పండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

కోవెలకుంట్ల, ఆగస్టు 11 : కోవెలకుంట్లలోని ఆర్టీసీ డిపోలో సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు తిరుపతయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యలుంటే 9959225798 నెంబరుకు ఫోను చేసి తెలియజేయాలని సూచించారు.

పంట నమోదు తప్పనిసరి: ఏవో

కొలిమిగుండ్ల, ఆగస్టు 11 : తమ పొలాల్లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని కొలిమిగుండ్ల మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి ఆదివారం వెల్లడించారు. పంట నమోదుతో రైతులకు అనేక లాభాలు వుంటాయని అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

శ్రీకృష్ణ జన్మాష్టమిపై ప్రచారం


భగవద్గీత గ్రంథాలను ప్రచారం చేస్తున్న త్రైతసిద్ధాంత సభ్యులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 11 : మండలంలోని బెలుంశింగవరం గ్రామంలో త్రైతసిద్ధాంతం, ప్రబోధా సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆదివారం తాడిపత్రి కమిటీ సభ్యులు బాలయ్య, రామానంద, మద్దిలేటి, ప్రభాకరరెడ్డి, ఉపేంద్ర తదితరులు ఇంటింటికి తిరిగి త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. భగవద్గీత పుస్తకాలను ప్రజలకు అందించారు.



మహిళపై దాడి

కొలిమిగుండ్ల, ఆగస్టు 11 : కొలిమిగుండ్లలోని లక్ష్మీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న సరస్వతి అనే మహిళపై కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ గోవిందనాయక్ ఆదివారం తెలిపారు. చిన్నకాంతన్న తన భార్యను కాపురానికి పంపలేదని, బావమరిది కంబగిరిస్వామిపై దాడి చేస్తుండగా, కంబగిరిస్వామి భార్య అయిన సరస్వ తి అడ్డుపడగా ఆమెపై కూడా కత్తితో దాడి చేశాడని, బాధితురాలు సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ గోవిందనాయక్ తెలిపారు.

వరద కష్టాలు

27 ఏళ్ల నుంచి ఇబ్బందులు
పట్టించుకోని పాలకులు, అధికారులు

చాగలమర్రి, ఆగస్టు 11: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలో వక్కిలేరుపై హైలెవెల్ వంతెన నిర్మించపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో వంతెనపై వరద నీరు ప్రవహిస్తోంది. వరద వచ్చిన ప్రతి సారి 10 రోజుల పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆ సమయంలో గ్రామస్థులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. ఇళ్లల్లోకి కూడా నీరు చేరుతోంది. పంట పొలాలు కూడా నీట మునిగి రైతులకు పంట నష్టం వాటిల్లుతోంది. పక్కన ఉన్న గొట్లూరు గ్రామానికి చేరుకొని అక్కడి నుంచి వాహనాల్లో కడప జిల్లా ప్రొద్దుటూరుకు వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్య 27 ఏళ్ల నుంచి ఉంది. గ్రామంలో సుమారు 250 కుటుంబాలు, 1,000 దాకా జనాభా ఉంది. లోతట్టు వంతెన కావడంతో ఏడాదిలో కనీసం 6 సార్లు వరద కష్టాలు తప్పడం లేదు. బ్రాహ్మణపల్లె నుంచి గొట్లూరు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, నేల వంతెన తొలగించి హైలెవెల్ వంతెన నిర్మించాలని ఎప్పటి నుంచో కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వంతెనను పెంచి, సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.


బ్రాహ్మణపల్లె వద్ద వక్కిలేరుపై లోతట్టు వంతెన

అధ్వానంగా రహదారులు


గుంతలమయంగా చిన్నవంగలి రహదారి

చాగలమర్రి, ఆగస్టు 11: మండలంలోని డి.వనిపెంట, కొత్తపల్లె, ఓజీ తాండ, ముత్యాలపాడు, చిన్నవంగలి గ్రామాలకు వెళ్లే రహదారులు బురదమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షానికి రహదారులు గుంతలమయంగా మారాయి. ఈ రహదారి వెంట ప్రజలు, రైతులు, కూలీలు, వాహనదారులు నరకయాతన పడుతున్నారు. గతంలో వేసిన తారు రోడ్లు దెబ్బతిని అధ్వానంగా మారాయి. మోస్తారు వర్షానికే రహదారులు నీటి కుంటను తలపిస్తున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామస్థులు పడరాని పాట్లు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వంలోనైన తమ కష్టాలు తీరుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.


ఓజీ తాండకు వెళ్లే రహదారి దుస్థితి

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

సంజామల, ఆగస్టు 11: సంజామలలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మిద్దె వెంకటరాముడు, నాయకులు బాలయ్య, చింతమాను కంబగిరి ఆధ్వర్యంలో ఎం.ఆర్.పి.ఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటరాముడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోవెలకుంట్ల, ఆగస్టు 11 : మండలంలోని గుళ్లదుర్తి గ్రామానికి చెందిన ఐదు మంది అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ ఆదివారం తెలిపారు. గ్రామంలో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి గులదుర్తి గ్రామంలోని చింత తోపు వద్ద దాడి చేయగా, ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,500 నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా


మాట్లాడుతున్న ఎస్ఐ

శిరివెళ్ల, ఆగస్టు 11: మండలంలోని గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ఎస్ఐ చిన్న పీరయ్య అన్నారు. శిరివెళ్ల ఎస్ఐగా ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించకుండా, గొడవలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ చిన్న పీరయ్యను టీడీపీ నాయకులు యామా గుర్రప్ప, బాల చంద్రుడు, కరీమ్, నాగలింగమయ్య, శేఖర్, బీసీ ఫిదాహుసేన్, రఫి, సిద్ధిక్, షఫివుల్లా తదితరులు కలిసి శాలువ, పూలమాలలతో సన్మానించారు.

రహదారే డంపింగ్ యార్డు..?


రోడ్డుపైనే చెత్తచెదారం

రుద్రవరం, ఆగస్టు 11 : రుద్రవరం మేజరు పంచాయతీ పరిధిలో రహదారే డంపింగ్‌యార్డుగా మారింది. రుద్రవరంలో చెత్త సంపద కేంద్రాలు నిర్మాణం చేపట్టలేదు. రుద్రవరం నుంచి అప్పనపల్లె వెళ్లే రహదారిలో డంపింగ్ యార్డు నిర్వహిస్తున్నారు. చెత్తచెదారం రోడ్డుపైకి వస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపక్కన కాకుండా, గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవగా స్వాతి నక్షత్ర వేడుకలు


స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

బేతంచెర్ల, ఆగస్టు 11: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఆదివారం వైభవంగా స్వాతి నక్షత్ర వేడుకలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు వేద పండితులు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, ఆలయ ఈవో రామాంజనేయులు సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అవుకు, ఆగస్టు 11 : అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన షేక్ పక్రుద్దీన్ (47) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజారెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ పక్రుద్దీన్ మద్యానికి బానిసై, అప్పులు చేసి పనులకు వెళ్లకుండ ఇంట్లోనే ఉండడంతో భార్య షేక్ ఫాతిమా మందలించిందన్నారు. పక్రుద్దీన్ మనస్థాపం చెంది శనివారం రాత్రి ఇంట్లోనే క్రిమిసంహారిక మందును తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా స్వాతి వేడుకలు


దిగువ అహోబిలంలో స్వామి సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 11: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను వేదపండితులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వేకువజామున్నే పూలమాలలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో సుదర్శన హోమాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

సంతాన వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఆగస్టు 11 : రుద్రవరంలో సంతాన వేణుగోపాలస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నిత్యతృప్తదాస్ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన భక్తులు గీతాపారయణం చేసి సంతాన వేణుగోపాలస్వామి రుక్మిణీ సత్యభామ అమ్మవార్లకు దర్శించుకుని పూజలు చేశారు.

- మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.
- మండలంలోని కొండమాయపల్లె, యల్లావత్తుల, చిన్నకంబలూరు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

పుట్టాలమ్మకు పూజలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 11: ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని పూజలు చేశారు. భక్తులకు వేదపండితులు అన్నదానం చేశారు.

పెద్దమ్మ తల్లికి పూజలు ..

కొలిమిగుండ్ల, ఆగస్టు 11 : మండలంలోని గొర్విమానుపల్లె, అబ్దులాపురం, మదనంతపురం తదితర గ్రామాల్లోని పెద్దమ్మతల్లి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం ఆదివారం కావడంతో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించారు. గొర్విమానుపల్లె పెద్దమ్మతల్లి ఆయలంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు.

సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

కోవెలకుంట్ల, ఆగస్టు 11 : కోవెలకుంట్లలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు 12 నుంచి 14 వరకు ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సయ్యదున్నీసా తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 2024-25 కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సర్పంచ్‌లకు పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5 వరకు అందరికీ పారిశుధ్య నిర్వహణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ గ్రామ పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. కాబట్టి ఈ శిక్షణ కార్యక్రమానికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మద్యం, నాటుసారా స్వాధీనం..

బేతంచెర్ల, ఆగస్టు 11: పట్టణంలోని కర్నూలు రహదారిలో పెట్రోల్ బంకు వద్ద మహిళా నుంచి కర్ణాటక మద్యం 180 ఎంఎల్ 14 టెట్రా ప్యాకెట్లను, పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య ఆదివారం తెలిపారు. గురువయ్య పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న కోట సావిత్రమ్మ అనే మహిళ కర్ణాటక మద్యం అక్రమంగా తెచ్చి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీవోలు


ఎమ్మెల్యే అఖిలప్రియతో ఎంపీడీవో

ఆళ్లగడ్డ, ఆగస్టు 11: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియను తాలుకా ఎంపీడీవోలు ఆదివారం పట్టణంలోని ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను అభినందించారు. ఎన్నికల సమయంలో వివిధ జిల్లాలకు వెళ్లిన ఎంపీడీవోలు తిరిగి ఆళ్లగడ్డ తాలుకాలోని వారి మండలాలకు వచ్చారు. గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆమె ఎంపీడీవోలకు సూచించారు.

దిమ్మె చుట్టూ గుర్రపు డెక్క

వంతెనకు పొంచి ఉన్న ముప్పు


వంతెన దిమ్మె చుట్టూ అల్లుకున్న గుర్రెపు డెక్క

ఉయ్యాలవాడ, ఆగస్టు 11: మండలంలోని రూపనగుడి- ఉయ్యాలవాడ గ్రామాల మధ్య ఉన్న కుందూ నది వంతెనకు గుర్రపు డెక్కతో ముప్పు పొంచి ఉంది. గత రెండు వారాలుగా కుందూ నదిలో భారీగా నీరు ప్రవహిస్తోంది. దాదాపుగా 20 అడుగులు పైకి నీరు ప్రవహిస్తోంది. ఈ వరద ప్రవాహంతోపాటు పై నుంచి భారీగా గుర్రపు డెక్క ఆకులు వస్తున్నాయి. ఇవి వంతెన కింద ఉన్న ఓ దిమ్మెకు అంటుకొని రెండు గండ్ల మధ్య భారీ ఎత్తున అల్లుకుంది. దీంతో ఆ దిమ్మె దెబ్బతినే ప్రమాదం ఉంది. అంతేకాకుండా గుర్రపు డెక్క ఆకు కుళ్లి పోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి ఆకును తొలగించాని రైతులు కోరుతున్నారు.

800 క్యూసెక్కుల నీటి ప్రవాహం


కేసీ కాలువలో ప్రవహిస్తున్న నీరు

చాగలమర్రి, ఆగస్టు 11: మండలంలోని రాజోలి ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాలువకు 800 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆదివారం కేసీ కాలువలోప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాజోలి ఆనకట్ట వద్ద 11 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని అన్నారు. కడప జిల్లావైపుగల కుందూనదికి గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశామని అన్నారు. కేసీ ప్రధాన కాలువ ద్వార చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ దస్తగిరి ఉన్నారు.

కరువు భత్యం మంజూరుపై హర్షం


మాట్లాడుతున్న కేఎస్ భానుసింగ్

డోన్(రూరల్), ఆగస్టు 11: జూలై నెలకు సంబంధించి కరువు భత్యం మంజూరు చేయడంపై పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేఎస్ భానుసింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేఎస్ భానుసింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పెన్షనర్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు, సభ్యులు సుబ్బరాయుడు, గాలయ్య, గోపాల్, రామదాస్ రెడ్డి, తిమ్మయ్య, జయరాముడు, రిటైర్డ్ ఎస్ఐ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం


తిరుపాల్‌ను సన్మానిస్తున్న ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

డోన్(రూరల్), ఆగస్టు 11: ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన స్వచ్ఛంద సేవా సంస్థలను గుర్తించి సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ద్రోణాచలం సేవా సమితి సభ్యులు అనాథ మృతదేహాల అంత్యక్రియలు, ఇతర సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న తిరుపాలును, షేర్షాను సన్మానించారు. కార్యక్రమంలో స్వాతి, రామకృష్ణ, విద్యాలయాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ప్రగతి, డా.శశికళ పాల్గొన్నారు.

అవుకు ఎస్ఐగా రాజారెడ్డి



అవుకు, ఆగస్టు 11 : అవుకు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా రాజారెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై అవుకు స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే ఘర్షణలకు దిగకుండా తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని తెలిపారు.

సందర్శకులతో కిటకిటలాడిన వాల్మీకి గుహలు


గుహల సందర్శనకు వచ్చిన కర్ణాటక వాసులు

ప్యాపిలి, ఆగస్టు 11: మండలంలోని వాల్మీకి గుహలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. అనంతపురం, కర్నూలు, కర్ణాటక నుంచి వాహనాల్లో వచ్చి గుహలను తిలకించారు. గుహల్లో ఉన్న ఆకృతులు, శివలింగాలు పర్యాటకులను కనువిందు చేశాయి. గుహలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని వారు ఆనందం వ్యక్తం చేశారు.

నేటి నుంచి కార్యదర్శులకు శిక్షణా తరగతులు

ప్యాపిలి, ఆగస్టు 11: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాయి మనోహర్ ఆదివారం తెలిపారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు పంచాయతీ కార్యదర్శులందరి ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ చట్టంలోని వివిధ అంశాలపై శిక్షణా తరగతులు ఉంటాయని ఎంపీడీవో తెలిపారు. కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రికార్డులు సక్రమంగా ఉంచండి

రుద్రవరం, ఆగస్టు 11 : రుద్రవరం పోలీసుస్టేషన్‌ను సీఐ చంద్రబాబు ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీసుస్టేషన్ పరిధిలో ఎప్పటికప్పుడు సమాచారం తమ దృష్టికి తేవాలన్నారు. నిర్లక్ష్యం చేయవద్దని సిబ్బందిని ఆదేశించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


నివాళి అర్పిస్తున్న బీసీ రాజారెడ్డి

సంజామల, ఆగస్టు 11: టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని బనగానపల్లె మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి అన్నారు. ఆదివారం ఆకుమళ్ల గ్రామానికి చెందిన జక్కం శ్రీనాథ రెడ్డి మాతృమూర్తి జక్కం బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజారెడ్డి ఉదయం ఆకుమళ్లకు చేరుకొని మృతురాలి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, మహేశ్వర రెడ్డి, యూనిస్ బాషా, తిమ్మయ్య, రామగోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



బేతంచెర్ల, ఆగస్టు 11: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ ద్వారా గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. అయితే ముసలాయ చెరువు ముద్దవరం గ్రామాల మధ్య సంజీవరెడ్డి కుంట వాగులో పైపులైన్ ఏర్పాటు చేయడం వల్ల కొట్టుకపోయింది. దీంతో నీరు వృథాగా పొలాల్లో పారుతోంది. తాగునీటికి కూడా ఇబ్బందిగా మారిందని ప్రజలు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.